క్లుప్తంగా

వెంకన్న సన్నిధిలో భక్తుల సందడి



కేటీదొడ్డి: మండలంలో వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని శనివారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి దాసాంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుకు శ్రమదానం



అయిజ: రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన సుధాకర్ గౌడ్ శనివారం శ్రమదానం చేశాడు. మండలంలోని చిన్న తాండ్రపాడు– అయిజ రోడ్డు శిథిలమై ప్రయాణానికి ప్రతికూలంగా మారడంతో మట్టితో రోడ్డుపై గుంతలు పూడ్చాడు. ఈ సందర్భంగా ప్రయాణికులు సుధాకర్‌ను అభినందించారు.

ప్రతినెల వైద్య పరీక్షలు చేయించుకోవాలి

మల్దకల్ : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలు ప్రతి నెల తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యురాలు స్వరూపరాణి సూచించారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవడం సురక్షితమన్నారు. పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



అయిజ : మండలంలోని రాజాపురంలో శనివారం సీసీరోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జయన్న భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 5 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్, రవీందర్, అబ్రహం, హరుణ్ బాషా, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బైక్, కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి : రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి గాయపడిన ఘటన మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. కర్నూల్ నుంచి మారమునగాల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి బైక్‌పై శుక్రవారం రాత్రి ఉండవెల్లి శివారులోని జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా అతి వేగంతో కర్నూల్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కృష్ణారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. శనివారం కృష్ణారెడ్డి భార్య జయసుధ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వీరన్న తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మానవపాడు : మండలంలోని నారాయణపురం గ్రామంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.తనగాల జట్టుకు మొదటి బహుమతి రూ.15 వేలు సతీష్‌రెడ్డి, పంచలింగాల జట్టుకు ద్వితీయ బహుమతి రూ. 10వేలు లోకారెడ్డి, మానవపాడు జట్టుకు తృతీయ బహుమతి రూ. 5వేలు భాస్కర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ కొందరికే..

- బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరుగుతున్న రైతులు
- ఆందోళనలో అన్నదాతలు



ఉండవెల్లిలో రుణమాఫీ కాలేదని పత్రాలు అందజేస్తున్న రైతులు(ఫైల్)

ఉండవెల్లి: ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రకటించగా క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో రైతులు బ్యాంకులు, సొసైటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా రైతుభరోసా అందక, రుణమాఫీ కాకపోవడంతో ఆందోళనకు గురువుతున్నారు. రూ.2 లక్షలపైగా రుణం ఉన్న రైతులు అసలు మాఫీ కాలేదని వాపోతున్నారు.

3847 మంది రైతులకే మాఫీ..

మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో కేవలం 3,847 మంది రైతుల రుణాలు మాత్రమే మాఫీ అయినట్లు అధికారులు తెలిపారు. దాదాపు రూ.32,54,66,622 మాత్రమే మాఫీ అయింది. కొందరి రుణాలు సందిగ్ధంలో ఉన్నాయి. మొత్తం నాలుగు విడతల్లో రుణాలను రూ.2 లక్షల లోపు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా రూ.1,50 లక్షలు మాత్రమే రుణం మాఫీ కావడంతో రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్నవారు బ్యాంకుల్లో రెన్యువల్ చేయించుకున్నారు. కానీ వారికి కూడా నిరాశే మిగిలింది. ఎస్‌బీఐ, గ్రామీణ బ్యాంకు, ప్రాథమిక సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారి అకౌంట్ బుక్‌లో ఉన్న పేర్లు తప్పుగా ఉండడంతో వారికి కూడా రుణాలు మాఫీ జరుగలేదు. తండ్రి మరణించి, భార్య, కుమారుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారివి లిస్టులో రాలేదని, అన్ని సరిచేసుకున్న తరుణంలో కూడా మాఫీ కాలేదని రైతులు వాపోతున్నారు.

గతంలో చేసిన వారికి మాత్రమే..

గత ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణం మాఫీ చేయడంతో అదే వివరాలు సేకరించి వారికి మరల రుణమాఫీ చేయడంతో ప్రస్తుతం రుణం ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదికి రుణాలు రెన్యువల్ చేస్తున్న వారికి కాకుండా, రుణం ఎగ్గొటే వారికే అధికారులు మాఫీ చేశారని మండలంలోని రైతులు ఆరోపిస్తున్నారు.

రుణమాఫీ జరగలేదు..



బ్యాంకులో కొందరికి రెండుమార్లు రుణమాఫీ జరిగింది. అకౌంట్‌లో ఏదో తప్పుందని మార్పు చేయమన్నారు. అయినా జాబితాలో పేరు రాలేదు. లక్షలోపే ఉన్న రుణం మాఫీ కాలేదు. మాలాంటి సన్నకారు రైతులకు త్వరగా రుణాలను మాఫీ చేయాలి.

–లక్ష్మీదేవి, ఉండవెల్లి

ఖర్చులు పెరుగుతున్నాయి..



పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండటంతో రుణాలు అధికంగా తీసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ అని ప్రకటించినా రుణం మాఫీ కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రుణమాఫీ చేసి అప్పుల ఊబి నుంచి రైతులను కాపాడాలి.

–మోహన్ రాజ్, ప్రాగటూరు

సేవింగ్ సర్టిఫికెట్ మహిళలకు వరం



కరపత్రాలు విడుదల చేస్తున్న సైదా నాయక్

గద్వాల న్యూటౌన్: మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్ (ఎంఎస్ఎస్‌సీ) మహిళలకు వరమని గద్వాల తపాలా శాఖ సహాయ పర్యవేక్షకుడు సైదా నాయక్ అన్నారు. శనివారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఎంఎస్ఎస్‌సీ ఖాతాకు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్‌ను పోస్ట్‌మాస్టర్ కళావతి, ఇతర మహిళా ఉద్యోగులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023లో కేంద్రం ఎంఎస్ఎస్‌సీ అనే పొదుపు పథకాన్ని ప్రత్యేకంగా మహిళల కోసం ప్రవేశపెట్టిందన్నారు. రూ.1000 నుంచి రూ. 2లక్షల వరకు పెట్టుబడిగా పెట్టుకోవచ్చనని తెలిపారు. 7.5 శాతం వడ్డీ వస్తుందని, మార్చి 31వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు మద్దమ్మ, బుజ్జి, రాజశేఖర్, బసంత్ రెడ్డి, భానుప్రసాద్, ప్రశాంత్, మైసయ్య, జగదీష్, ఇస్మాయిల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్

అయిజ : బాలల హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ అన్నారు. బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని మేడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల పరిరక్షణ విభాగం, ఉమెన్ హబ్, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ హాజరై మాట్లాడారు. బాలలకు రక్షణ, సంరక్షణ కల్పించేందుకు బాల రక్ష భవన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలలందరూ స్వేచ్ఛా వాతావరణంలో పెరగాలన్నారు. ఆడపిల్లలపై మగపిల్లలు సోదర భావంతో మెలగాలన్నారు. లైంగిక వేధింపులు ఎదురైనా, బాల్య వివాహాలు చేస్తున్నా సరే 100 లేదా 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, ఉమెన్ హబ్ సభ్యులు చిట్టెమ్మ, సరోజ, చైల్డ్ లైన్ సభ్యుడు నవీన్, పోలీస్ కానిస్టేబుల్ రామాంజనేయులు, రమణ, ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ చిన్న తిమ్మన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ఓబులోనిపల్లిలో వంటగది పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్ర బాబు అన్నారు. మండల పరిధిలోని మార్లబీడు ఉన్నత పాఠశాల, ఓబులోనిపల్లి ప్రాథమిక పాఠశాలను రవీంద్ర బాబు శనివారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆహార నాణ్యతపై ఆరా తీశారు. వంటలు వండే వారు శుచి, శుభ్రతతో వండాలని సూచించారు. గడువు ముగిసిన సరుకులు వాడొద్దని హెచ్చరించారు. ప్రతి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ నంబరు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు విజయ్, శివకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన మండలాలు ఏర్పాటు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న అఖిలపక్ష నాయకులు

గద్వాలటౌన్ : నియోజకవర్గంలో నూతన మండలాలు ఏర్పాటు చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మోహన్ రావు డిమాండ్ చేశారు. నూతన మండలాల ఏర్పాటు కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం నూతన మండలాల ఏర్పాటుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నూతన మండలాల ఏర్పాటు కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10న స్థానిక వాల్మీకి భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేధావులు, విద్యా వంతులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పల్లయ్య, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

గద్వాల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న హైదారాబాద్‌లో తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో కార్మికులకు కనీస వేతనాల పెంపుదల, శ్రామికుల ఆదాయాల పెరుగుదలకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని విమర్శించారు. లేబర్‌కోడ్స్ అమల్లోకి తీసుకొచ్చి శ్రమ దోపిడి విధానాన్ని పెంచి, కార్మికుల హక్కులను హరించి వేస్తున్నట్లు మండిపడ్డారు. మహాధర్నా కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీవీ నర్సింహ, ఉప్పేరు నర్సింహ, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



అశోక్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖిల్లాఘనపురం: విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బి. అశోక్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని తెలంగాణ మాడల్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన మోటివేషన్ తరగతులు నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తగా చదివే విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లుగా కలలు కనండి వాటిని సహకారం చేసుకోవడానికి కృషి చేయండి అన్నారు. అనుకున్న రంగంలో రాణించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. అందుకు ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి కన్నతల్లిదండ్రులు, పుట్టిన ఊరు, గురువులకు మంచి పేరుతీసుక రావాలన్నారు. ఆయన అడిగిన ప్రశ్నలకు సమాదానాలు ఇస్తూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఓటీఎస్’ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సీఈఓకు నగదు అందజేస్తున్న రైతు

పాన్‌గల్: ప్రాథమిక సహకార సంఘం ద్వారా దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను సద్వినియోగం చేసుకొని అపరాధ వడ్డీమాఫీని పొందాలని సీఈఓ భాస్కర్‌గౌడ్ రైతులకు సూచించారు. శనివారం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక సహకార సంఘం పరిధిలో దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు దాదాపుగా 392 మంది ఉన్నారని, వారి ద్వారా రూ.3 కోట్ల అప్పులు బ్యాంకుకు రావాల్సి ఉందన్నారు. ఓటీఎస్ గడువు ఈనెల 15వ తేదీ వరకు ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 10 శాతం మంది రైతులకు అపరాధ వడ్డీ ద్వారా రూ.21.70 లక్షల వరకు మాఫీ కాగా.. వారు కేవలం రూ.9.25 లక్షలు మాత్రమే చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



గద్వాల క్రైం : సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు సీఈఐఆర్ యాప్‌లో ఫిర్యాదు చేయగా ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు వాసికి డాక్టరేట్

మానవపాడు : మండలంలోని మద్దూరు గ్రామానికి కుర్వ ఈశ్వర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. చరిత్ర విభాగంలో ప్రొఫెసర్ బి. లావణ్య ఆధ్వర్యంలో శనివారం కల్చరల్ సింబల్స్ ఆఫ్ తెలంగాణ మీద పరిశోధనకు ప్రదానం చేసినట్లు ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



గట్టు : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి శనివారం గద్వాల డీఎస్పీ మొగులయ్య చాగదోన, బోయలగూడెం గ్రామాల్లో విచారణ చేపట్టారు. కేసుకు సంబంధించి గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

గద్వాల : మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 34వ వార్డుకు చెందిన అశోక్‌కు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

అంబరాన్నంటిన బీజేపీ సంబరాలు



అయిజలో మిఠాయిలు తినిపిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గద్వాల/గద్వాలటౌన్ : ఢిల్లీలో బీజేపీ సంచలన విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన రోడ్లపై పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, ర్యాలీ నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ చూస్తారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రామంజనేయులు అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రజా విజయంగా పేర్కొన్నారు. మోదీ అభివృద్ధి మంత్రం ఒక్కటే పనిచేసిందన్నారు. ఢిల్లీ ఫలితాలే తెలంగాణ రాష్ట్రంలో రిపీట్ అవుతాయని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్ ఏక్బోటే, దేవదాసు, అనిల్, వాసు, అతావుర్ రహమాన్, ఆసిఫ్, డబ్బులేటి నర్సింహ, మోహన్‌రెడ్డి, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

■ దేశ రాజధాని ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంతో జిల్లా కేంద్రంలో బీజేపీ నేతలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. డీకే బంగ్లా , వైఎస్సార్ చౌరస్తాలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రామాంజనేయులు, దేవదాసు, రవి, కృష్ణ, అనిల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: ఢిల్లీ రాష్ట్రంలో బీజేపీ గెలుపు మార్పునకు మలుపుని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సందర్భంగా మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. తెలంగాణలో నిర్వహించనున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేన్ రావు, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు వీరయ్య చారి, పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ ఆవరణలో బాణా సంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గూడురు నాగప్ప, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గొర్ల నర్సింహులు, నాయకులు దుబాయ్ నర్సింహులు, మూర్తి, బహద్దూర్‌రెడ్డి, సల్కాపురం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయం సందర్భంగా మండల కేంద్రంలోని బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు హన్మిరెడ్డి, శ్రీపాదరెడ్డి, భీమ్‌రెడ్డి, సూర్యకాంత్ రెడ్డి, రాములు, కృష్ణకాంత్, మునెప్ప, వీరేష్, విజయ్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. కూడలిలో బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్ సాగర్, సత్యం, సంపత్, దేవేందర్‌గౌడ్, తిమ్మన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజోళి : నిజాయతీ ముసుగులో అక్రమాలకు పాల్పడిన ఆప్ పార్టీని ఢిల్లీ ప్రజలు ఛీకొట్టారని బీజేపీ నాయకులు అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై మండల కేంద్రంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా తమ స్థానమేంటో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శశి కుమార్, సంజీవ రెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో బాణసంచా కాల్చుతున్న బీజేపీ నాయకులు

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు సిద్ధం

- 10న కల్యాణోత్సవం
- 12 రథోత్సవం



కొలువుదీరిన భూలక్ష్మీసమేత చెన్నకేశవ స్వామి



విద్యుద్దీపాలంకరణలో ఆలయ ప్రాంగణం

గద్వాలటౌన్ : గద్వాల కోటలో వెలసిన శ్రీభూలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలు మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో జరగనున్నాయి. వేడుకలను పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 16 ఏళ్ల క్రితం గద్వాల కోటలోని ఆలయ పరిసర ప్రాంతాలు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంత్రాలయం మఠానికి అప్పగించారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు గద్వాల చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుంటారు. ఈనెల 9 నుంచి 15 తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. 10న నిర్వహించనున్న కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో పాటు పట్టణ పుర ప్రముఖులు, నాయకులు, అధికారులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రథోత్సవం, ప్రత్యేక పూజలు మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ శ్రీపాదుల ఆధ్వర్యంలో జరుగనున్నాయి. లింగంబావిలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.